

గ్రూప్-2 అభ్యర్థులకు మాక్ టెస్టులు

మేడ్చల్ ప్రతినిధి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-2 పరీక్షల్లో పాల్గొనే మైనార్టీ అభ్యర్థుల (ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన్, పార్సీ, బౌద్ధులు)కోసం ఉచిత మాక్ టెస్టులు నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారి వీణ తెలిపారు. అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. డిసెంబరు 2,3,9,10 తేదీల్లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.వివరాలకు 9493037940, 9000168256లలో సంప్రదించాలన్నారు.



న్యూడ్ వీడియో కాల్‌తో బ్లాక్ మెయిల్

యువకుడి నుంచి డబ్బు కాజేసిన వైనం

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడికి గుర్తు తెలియని యువతి నగ్న(న్యూడ్) వీడియో కాల్ చేసింది. తనకు డబ్బు పంపకుంటే మాట్లాడిన వీడియోలను వైరల్ చేస్తానని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు కాజేసింది. ఈ ఘటన పోచారం ఐటీ కారిడార్ పరిధిలో వెలుగు చూసింది. ఆదిలాబాద్ పట్టణం సంజయ్‌నగర్‌కు చెందిన యువకుడు పోచారం పరిధి చౌదరిగూడ మల్లమ్మ కాలనీలో అద్దెకుంటున్నాడు. ఎంసీఏ చేసి జాబ్ ట్రైల్స్ చేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి ఆ యువకుడి మొబైల్‌కు వీడియో కాల్ వచ్చింది. 'నేను దీక్షికా అగర్వాల్. నార్తిండియా నుంచి మాట్లాడుతున్నా.. ఎలా ఉన్నావు? బాగున్నావా? ఏమి చదువుతున్నావు?' అని కుశల ప్రశ్నలు వేసింది. యువతి ప్రశ్నలకు సమాధానం చెబుతుండగానే ఆమె నగ్నంగా మారింది. యువతి వారి వీడియో సంభాషణను రికార్డు చేసి ఆ యువకుడికే పంపింది. 'వెంటనే డబ్బులివ్వకుంటే ఈ వీడియోను మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు పంపుతా. నీ ఇజ్జత్ తీస్తా.' అని బెదిరించింది. దీంతో యువకుడు రూ.10వేలు పంపాడు. మరోసారి డబ్బు డిమాండ్ చేయడంతో మరో రూ.10వేలు.. ఇలా మొత్తం రూ.20వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. మరుసటి రోజూ డబ్బు కోసం డిమాండ్ చేయడంతో సదరు యువకుడు ఐటీసీ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



బాకారం జాగీర్ గ్రామ పరిధిలోని ఫామ్‌హౌస్‌లో వాటర్ ఫాల్‌లో ఎంజాయ్ చేస్తున్న పిల్లలు

Sunday Special

ఆనందాల హరివిల్లు ప్రకృతి పొదరిల్లు

పల్లెలకు పాకిన ఫామ్‌హౌస్ సంస్కృతి

నిత్యం ఉరుకులు పరుగుల జీవనం గడుపుతున్న పట్టణ వాసులు పల్లె వాతావరణాన్ని కోరుకుంటున్నారు. ప్రకృతి చెంతనే జీవించేందుకు ఇష్టపడుతున్నారు. దీంతో పల్లెల్లో ఫాంహౌస్ కల్చర్ విస్తరిస్తోంది. అనేక మంది పంటపొలాల వద్ద తమకు కావలసిన విధంగా ఫాంహౌస్‌లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. మరికొందరు పట్టణాల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడి నుంచే ప్రయాణం కొనసాగిస్తుండగా, ఇంకొంత మంది వారాంతపు సెలవుల్లో ఫాంహౌస్‌లకు వెళ్లి సేదతీరుతున్నారు.



ఫాంహౌస్‌లో సేదతీరుతూ..

- ప్రకృతి ఒడిలో సేదదీరుతున్న నగర వాసులు
- పొలాల మధ్య సకల సౌకర్యాలతో నిర్మాణం
- వారాంతాల్లో బంధుమిత్రులతో కలిసి విడిది



నగర శివారులోని ఓ ఫాంహౌస్

రంగారెడ్డి అర్బన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, ముంబయి లాంటి మెట్రోపాలిటన్ నగరాల శివారులో బడా పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు విశాలమైన వ్యసాయ భూములను కొనుగోలు చేసి ఫామ్‌హౌస్‌లు నిర్మించుకునే వారు. వీలైనప్పుడల్లా అక్కడికి వెళ్లి ప్రకృతి అందించే స్వేచ్ఛాయుత వాయువులను పీల్చేవారు. రకరకాల మొక్కలను పెంచుకుని అవి అందించే మకరందాన్ని ఆస్వాదించేవారు. మొత్తంగా విలాసవంతమైన జీవితాన్ని అనుభవించే వారు. ఆ సంస్కృతి ఇప్పుడు పల్లెలను తాకింది. బడా వ్యాపారులు, బిల్డర్‌లు, ఉన్నతస్థాయి ఉద్యోగులు మారుమూల గ్రామాల్లో అర ఎకరం నుంచి ఐదెకరాల వరకు వ్యవసాయ భూమిని కొనుగోలు చేస్తున్నారు. ఆ భూమి చుట్టూ

మిగతా 7వ పేజీలో...



స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్న ఆలయ నిర్వాహకులు

రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం

చీర్యాల్‌లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

కీసర, నవంబరు23(ఆంధ్రజ్యోతి): కీసరగుట్ట రామలింగేశ్వర స్వామికి శ్రీ మహన్యాస పూర్వక రుద్రాభిషేకం శనివారం ఘనంగా జరిగింది. కార్తీకమాసోత్సవంలో భాగంగా ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం దేవాదాయ శాఖ ఉన్నత అధికారుల మేరకు ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అహ్మద్ గూడకు చెందిన భక్తుడు పి.సంతోష్‌గౌడ్ ఆలయానికి విరాళంగా రూ. 60వేల విలువైన వంట సామగ్రిని అందజేశారు. అదేవిధంగా సంకల్ప సిద్ధిగా పేరుగాంచిన చీర్యాల్ శ్రీ లక్ష్మీ నరసింహ్మ స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు కనుల పండువగా జరిగాయి. కార్తీక మాసం పురస్కరించుకొని భక్తులు శనివారం ఆలయానికి అధిక సంఖ్యల్లో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఆనంతరం సామూహిక సత్యనారాయణ వ్రతాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు.



లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు

తాండూరుకు సమీకృత గురుకులం 7

- 25 ఎకరాలు కేటాయింపు
- రూ. 150 కోట్లతో నిర్మాణం
- ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు
- వచ్చేఏడాది అందుబాటులోకి..



ముగిసిన కాలుష్య పరీక్షలు 7

- తాండూరులో రెండోరోజు టెస్టింగ్
- 24గంటల పాటు రెండు యంత్రాలతో గాలి నాణ్యత పరిశీలన
- సీసీఐ, సుద్ద, పాలిషింగ్ యూనిట్లతో వాయు కాలుష్యం




యథేచ్ఛగా చెట్ల నరికివేత 8

- విద్యుత్ తీగలకు తగులుతున్నాయని సగం వరకు తొలగింపు
- ముందుచూపు లేని అధికారులు
- విద్యుత్ లైన్లకింద మొక్కలు నాటకుండా చూడాలని వినతి



తెలవారినా.. తొలగవేం..



అసలే శీతాకాలం... ఆపై దట్టమైన పొగ మంచు... రహదారి వెంట ఇరువైపులా పొదరిల్లులా అల్లుకున్న భారీ వృక్షాలు.. అప్పుడే నింగి నుంచి నేలను తాకుతున్న భానుడి కిరణాలు... వీటన్నింటినీ ఒకేచోట చూస్తే ఆ సౌందర్య దృశ్యం వర్ణనాతీతం. ఈ అపురూపం మన్నెగూడ నుంచి వికారాబాద్ దారిలో ఆవిష్కృతమైంది. ఈ రోడ్డు వెంట ప్రయాణించే వాహనదారులు ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదిస్తూ ముందుకు సాగారు. ఇలాంటి కనువిందు చేసే దృశ్యాలు మళ్లీ మళ్లీ చూడలేమని కొందరు ఫొటోలు దిగారు.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి

రుణమాఫీకి రూ.31వేల కోట్లు

- రూ.300 కోట్లతో అనంతగిరి అభివృద్ధి
- స్పీకర్ ప్రసాద్‌కుమార్



అనంతగిరి అర్బన్ ఫారెస్ట్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

వికారాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ కోసం బడ్జెట్‌లో రూ.31వేల కోట్ల రూపాయలను కేటాయించిందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. అనంతగిరి అటవీ ప్రాంతంలో శని వారం అనంతగిరి అర్బన్ ఫారెస్ట్ పార్కుకు శంకుస్థాపన చేసి భూమిపూజ చేశారు. ముందుగా రూ.25 లక్షలతో నూతనంగా నిర్మించిన ఫారెస్ట్ సెక్షన్ అధికారి కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కష్టపడుతున్నారని తెలిపారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అందుతుందని తెలిపారు. వికారాబాద్ అనంతగిరి భగవంతుడి ప్రసాదమని, అందమైన ప్రదేశమని స్పీకర్ అన్నారు. రూ.300కోట్లతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడానికి త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అనంతగిరి అటవీ ప్రాంతాన్ని అన్నివిధాలుగా పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఇప్పటికే రెండు విదేశీ కంపెనీలు ఇచ్చిన ప్రెజెంటేషన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కలిసి చూశానని తెలిపారు. అనంతగిరి పర్యావరణానికి హాని కలగకుండా అన్ని వసతులతో ఎకో టూరిజంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ప్రియాంక వర్గీస్, డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

డీఈవో రేణుకాదేవి



పరిగి జడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో రేణుకాదేవి

పరిగి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి అన్నారు. శనివారం పరిగి పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ నెం.1, 2 పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో వంటగది, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. చింతపండు పుచ్చిపోయి ఉండడంతో ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పరిగి,దోమ మండలాల ఎంఈవోలు గోపాల్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు సమగ్ర సర్వే

- వికారాబాద్ జిల్లాలో 89 శాతం..రంగారెడ్డి జిల్లాలో 88.3 శాతం పూర్తి
- రంగారెడ్డిలో డాటా ఎంట్రీ షురూ
- 7,700 కుటుంబాల వివరాలు కంప్యూటరీకరణ
- వికారాబాద్‌లో డాటా ఎంట్రీ కోసం 176 కంప్యూటర్లు సిద్ధం



బండవెల్కిచర్లలో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు

వికారాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చివరి దశకు చేరింది. శనివారం వరకు రంగారెడ్డి జిల్లాలో 88.3 శాతం సర్వే పూర్తి కాగా, వికారాబాద్ జిల్లాలో 89 శాతం పూర్తయ్యింది. రంగారెడ్డి జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో 95 శాతం సర్వే పూర్తి చేయగా, మున్సిపాలిటీల్లో

- మిగతా 7వ పేజీలో..

రేపు లగచర్లకు తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్

వికారాబాద్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లగచర్ల ఘటనపై విచారణ నిర్వహించేందుకు ఈనెల 25న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ దుద్యాల మండలంలో పర్యటించనుంది, కలెక్టర్, ఇతర అధికారులపై దాడి పేరుతో తమపై పోలీసులు దాడులు చేసి అక్రమంగా అరెస్టులు చేశారని లగచర్ల బాధితులు ఇటీవల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన కమిషన్ చైర్మన్ కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు జారీ చేశారు. సోమవారం కమిషన్ చైర్మన్, సభ్యులు లగచర్లలో పర్యటించి బాధిత దళిత, గిరిజనులతో మాట్లాడి వివరాలు తెలుసుకోనున్నారు. అనంతరం అనంతగిరి హరిత రిసార్ట్స్‌కు వస్తారు. మధ్యాహ్నం 2గంటలకు ఇక్కడి నుంచి సంగారెడ్డికి వెళ్లి అక్కడ జైలులో ఉన్న లగచర్ల బాధితులను కలిసి దాడిరోజు చోటు చేసుకున్న పరిణామాలు తెలుసుకోనున్నారు.

కన్హా శాంతివనానికి గుజరాత్ గవర్నర్



నందిగామ, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): నందిగామ మండలంలోని కన్హా శాంతివనాన్ని గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ శనివారం సందర్శించారు. శాంతివనంలో ఏర్పాటు చేసిన ట్రీ కన్సర్వేషన్ సెంటర్, టిష్యూ కల్చర్ లెబోరేటరీలను గురూజీ కమలేష్ డీ పటేల్‌తో కలిసి గవర్నర్ పరిశీలించారు. రామచంద్రమిషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు గురూజీతో కలిసి దేవవ్రత్ ధ్యాన మందిరంలో 15నిమిషాలు ధ్యానం చేశారు. అనంతరం శాంతివనంలో ఎర్ర చందనం మొక్కను నాటారు. కార్యక్రమంలో రామచంద్రమిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏసీపీ కార్యాలయాన్ని సందర్శించిన డీసీపీ



మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

చేవెళ్ల, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఏసీపీ కార్యాలయాన్ని శనివారం రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా చేవెళ్ల, మొయినాబాద్, షాబాద్ పోలీస్‌స్టేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ల వారీగా కేసుల వివరాలను, ఎస్సీ ఎస్టీ కేసులు, ఇతర పెండింగ్ కేసుల పురోగతిపై ఏసీపీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బంది మరింత బాధ్యతయుతంగా పని చేయాలని డీసీపీ సూచించారు. సమావేశంలో ఏసీపీ బంటు కిషన్, డీఐ సీఐ రమేశ్‌నాయుడు, సీఐలు భూపాల్‌శ్రీధర్, కాంతరెడ్డి, పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు రాకుండా చర్యలు



వడ్లలో తేమను పరిశీలిస్తున్న ఏపీడీ నర్సింహ్మా

యాచారం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలకు తెచ్చే వడ్లలో తేమ 17శాతం ఉండేలా ఎండబోయాలని, మట్టిపెళ్లలు, తాలు లేకుండా ఎగబోయాలని డీఆర్‌డీవో ఏపీడీ నర్సింహ్మా రైతులను కోరారు. శనివారం చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. పొలాల వద్ద ధాన్యం ఎండబోయకుంటే కొనుగోలు కేంద్రం ఎండపోయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు పంపుతున్నామన్నారు. అలాగే రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తున్నామని చెప్పారు. కాగా డ్వాక్రా మహిళలకు విరివిగా రుణాలిచ్చేందుకు సీసీలు చొరవ తీసుకోవాలని ఏపీడీ సెర్ప్ సిబ్బందిని ఆదేశించారు. యాచారంలో సెర్ప్ సిబ్బందితో సమావేశమయ్యారు. రుణం కావాలని కోరిన ప్రతీ మహిళకు తక్షణమే రుణం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రుణాలు తీసుకున్న వారి నుంచి రికవరీ చేయాలన్నారు. ఆయనతో ఏపీఎం సుదర్శన్‌రెడ్డి, ఏపీవో లింగయ్య, సీసీలు ఉన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞాన్ని అందిపుచ్చుకుంటూ అభివృద్ధి వైపు సాగాలని సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ కె.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదిభట్ల పరిధిలోని మంగల్పల్లి సీవీఆర్ విద్యాసంస్థల అధ్వర్యంలో ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఇబ్రహీంపట్నం, శేరిగూడ పాఠశాలల 9వ తరగతి విద్యార్థులు 62మంది పాల్గొన్నారు. వారికి ఎమ్మెస్ ఆఫీస్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ఇంటర్నెట్‌ల శిక్షణ ఇస్తున్నారు. లక్ష్యాన్ని ఎంచుకొని ప్రణాళికాబద్ధంగా చదివితే ఎంతటి విజయాన్నైనా సాధించొచ్చని అన్నారు. విద్యార్థి దశలో సుఖాలను త్యాగం చేసి కష్టపడితేనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుతారని రామ్మోహన్‌రెడ్డి అన్నారు. కష్టపడి ఉన్నత స్థాయికి వచ్చిన వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు కె.రామశాస్త్రి, లక్ష్మి, రత్నం, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ముగిసిన కాలుష్య పరీక్షలు



పోలీస్ స్టేషన్‌పై ఆర్డీఎస్ యంత్రాన్ని ఉంచుతున్న శాస్త్రవేత్తలు

తాండూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తాండూరులో గాలి కాలుష్యాన్ని గుర్తించేందుకు రెండోరోజు శనివారం కాలుష్య పరీక్షలు నిర్వహించారు. తాండూరులో గతంలోనూ ఈ పరీక్షలను నిర్వహించగా ఢిల్లీ కంటే ఎక్కువ కాలుష్యం ఉందని నిర్ధారించారు. తాండూరు ప్రాంతంలో విస్తరించిన సిమెంట్ కర్మాగారాలు, సుద్ధ, పాలిషింగ్ యూనిట్లతో వాయు కాలుష్యం విపరీతంగా పెరిగింది. తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో 24గంటల పాటు రెండు యంత్రాలతో గాలి నాణ్యత పరీక్ష నిర్వహించారు. పీసీబీ శాస్త్రవేత్త జిమోత వాహన ఆధ్వర్యంలో బృందం గాలి కాలుష్యాన్ని కొలిచే ఆర్డీఎస్(రెస్పిరేబుల్ డస్ట్ శ్యాంపెయిర్) యంత్రాలను ఒకటి పోలీస్‌స్టేషన్ భవనంపై, మరొకటి పాత తాండూరులో అమర్చారు. యంత్రంలో ప్రత్యేక రసాయనాలను కలిపి పరీక్షలు చేశారు. 24గంటలు యంత్రాలను ఆన్‌లో ఉంచి పరీక్ష చేశారు. నివేదికను ఉన్నతాధికారులకిస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. సాధారణంగా గాలిలో ఒక ఘనపు మీటరకు 100 మిల్లీ గ్రాముల ధూళి కణాలుంటాయి. అయితే 2016లో తాండూరులో 622మిల్లీ గ్రాముల ధూళి కణాలున్నట్టు తేలింది. ప్రస్తుతం ఈ పరిమాణం కూడా రెట్టింపయినట్లు గుర్తిస్తున్నారు.

ఎదులాబాద్‌లో ఒడిశా బృందం పర్యటన



ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్‌లో శనివారం ఒడిశా రాష్ట్రానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటించారు. ఎదులాబాద్‌లోని దివ్యాంగుల పునరావస కేంద్రంలోని పిల్లలతో మాట్లాడారు. అనంతరం మహిళ సంఘాలు నిర్వహిస్తున్న, బేకరితో పాటు పేరటి కోళ్ల పెంపకాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సాంబశివరావు, డీపీఎం సురేఖ, ప్రభాకర్, ఎంపీడీవో గీతారెడ్డి, ఎంపీవో రవినాయక్, ఎపీఎం తౌర్యానాయక్, మాధూరి పాల్గొన్నారు.

ఆనందాల హరివిల్లు ప్రకృతి పొదరిల్లు

(5వ పేజీ తరువాయి)

ఫెన్సింగ్, ప్రీకాస్ట్, ప్రహరీ ఏర్పాటు చేసుకొని రకరకాల పండ్ల, పూల మొక్కలను, ఆరోగ్యకరమైన చిరుధాన్యాలను సాగు చేస్తున్నారు. అంతేకాకుండా వ్యవసాయ క్షేత్రంలోని పచ్చని చెట్ల మధ్య ఆకర్షణీయంగా ఫామ్‌హౌస్‌లను నిర్మించుంటున్నారు. వారంలో రెండు రోజుల పాటు ప్రకృతి ఒడిలో కుటుంబ సభ్యులతో గడుపుతున్నారు. ముఖ్యంగా శని, ఆదివారాల్లో ఎంజాయ్ చేస్తున్నారు.

సకల సౌకర్యాలతో నిర్మాణం

వ్యవసాయ క్షేత్రాల్లో అన్ని హంగులతో సకల సౌకర్యాలు ఉండేలా ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుంటున్నారు. సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసుకుంటున్నారు. స్నేహితులు, బంధువులు ఎందరు వచ్చినా సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దుకుంటున్నారు. అవసరమైతే చిన్న చిన్న వేడుకలను జరుపుకునేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పిల్లల కోసం ప్రత్యేకంగా ఆట వస్తువులు, స్విమ్మింగ్ పూల్స్, ఆటల కోర్టులు, వాకింగ్ కోసం నిర్మాణాలు చేసుకుంటున్నారు.

పెరుగుతున్న కల్చర్

నగరాల్లో ప్రతి రోజూ కాలుష్యంతో సమరం చేస్తూ జీవనం సాగిస్తున్న పట్టణవాసులు ఒక్క రోజైనా పల్లెల్లో గడపాలని భావిస్తున్నారు. మధ్యతరగతి వారు దేవాలయాలు, పర్యాటక ప్రదేశాలకు వెళ్లి కాటేజీల్లో బస చేస్తుంటే, ధనికులు సొంతంగా వ్యవసాయ భూములు కొనుగోలు చేసి ఫాంహౌస్‌లను నిర్మించుకుంటున్నారు. పట్టణాలకు సమీపంలో ఉండే గ్రామాల్లో ఈ ఫాంహౌస్‌లను ఏర్పాటు చేసుకుని ప్రకృతి సహజసిద్ధ వాతావరణంలో జీవిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల పరిధిలోని చిలుకూరు, నక్కలపల్లి, తోల్‌కట్ట, ఎనికెపల్లి, అజీజ్‌నగర్, కుద్బుద్దీన్‌గూడ, రెడ్డిపల్లి, కేతిరెడ్డిపల్లి, చిన్నమంగళారం, అమ్డాపూర్ వంటి ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ఎక్కువగా ఫాంహౌజ్‌లు నిర్మించుకున్నారు. ఇంకా చాలావరకు నిర్మాణాలు జరుగుతున్నాయి. చేవెళ్ల మండలం ముడిమ్యాల, దేవుని ఎర్రవల్లి, ఆలూరు, గొల్లపల్లి, ఈర్లపల్లి, రామన్నగూడ, న్యాలట, శంకర్‌పల్లి మండలం కొత్తపల్లి, వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మన్నేగూడ ప్రాంతాల్లో ఎక్కువగా ఫామ్‌హౌస్‌లు ఉన్నాయి. కొంతమంది యువకులు వ్యవసాయాన్ని ఓ ఫ్యాషన్‌గా ఎంచుకుంటున్నారు. పొలం చెంతనే ఫార్మర్‌హౌజ్ ఏర్పాటు చేసుకొని విభిన్న రీతుల్లో వ్యవసాయాన్ని కొనసాగిస్తున్నారు. అక్కడే తమ కుటుంబంతో స్వచ్ఛమైన గాలి, నీరుతో పాటు ప్రశాంత వాతావరణంలో ఆరోగ్యకరమైన జీవనం గడుపుతున్నారు.



బాకారంలోని ఓ ఫామ్‌హౌస్‌లో వాటర్ ఫాల్స్‌లో ఎంజాయ్ చేస్తున్న కుటుంబ సభ్యులు



వ్యవసాయ క్షేత్రంలో స్విమ్మింగ్ పూల్



గ్రామ పరిధిలోని ఫాంహౌస్‌లో చిన్నారుల ఆటలు

తాండూరుకు సమీకృత గురుకులం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కాంప్లెక్స్‌కు సేకరించిన స్థలం ఇదే

తాండూరు, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాకు రెండో యంగ్ ఇండియా సమీకృత గురుకులం మంజూరైయింది. స్థలం ముందుగానే గుర్తించినా తాండూరు నియోజకవర్గానికి సంబంధించి గురుకులం పెండింగ్‌లో ఉంది. ఈ విషయంపై ఈ నెల 13న 'ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరయ్యేనా?' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో జిల్లా అధికారులు ప్రభుత్వానికి వివరాలతో నివేదిక పంపారు. ప్రభుత్వం శనివారం తాండూరుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. యాలాల మండలం దౌలాపూర్ వద్ద కొడంగల్ రోడ్డులో 25ఎకరాలను ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌కు కేటాయించారు. రూ.150కోట్లతో నిర్మిస్తారు. ఈ స్కూల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన 2,060 మంది వరకు విద్యార్థులకు, బోధన, బోధనేతర సిబ్బందికి వసతులు కల్పిస్తారు. ప్రభుత్వ నిర్ణయంపై తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి స్పందిస్తూ.. వెనుకబడిన తాండూరు ప్రాంతానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు చెబుతున్నట్టు తెలిపారు. త్వరలోనే నిర్మాణ పనులను చేపట్టి వచ్చే విద్యా సంవత్సరంలోగా విద్యార్థులకు అందుబాటులోకి తెస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

పథకాల అమలుకు అధికారులు చొరవ తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి

కడ్తాల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సంక్షేమ, అభివృద్ధి పథకాలు సక్రమంగా అమలయ్యేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి అన్నారు. లక్ష్యాల పూర్తికి అలసత్వం చేయొద్దన్నారు. కడ్తాలలోని ఎంబీఏ గార్డెన్‌లో శనివారం ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్షించారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. పేదలకు పథకాలందితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని రవి, నారాయణ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేత నిర్ణయాలు, పథకాలు అమలుచేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డీఆర్డీవో శ్రీలత, ఆర్డీవో అనంతరెడ్డి, డీఈవో సుశీందర్‌రావు, పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎంపీడీవోలు మాధురి, సుజాత, శ్రీకాంత్, తహసీల్దార్లు ముంతాజ్, లలిత, నాగార్జున, ఎంఈవో లు సత్యనారాయణ, పాండు, చంప్లానాయక్, సర్దార్‌నాయక్, డైరెక్టర్లు నరేశ్‌నాయక్, రమేశ్, పాండురంగయ్య, కేఎన్నార్ సేవాదళం అధ్యక్షుడు బాబ, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్ పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సు కోసం కృషి చేస్తా



గీత సన్మాన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే

కడ్తాల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి):రైతుల శ్రేయస్సు కోసం తాను నిరంతరం కృషిచేస్తానని ఆమనగల్లు మార్కెట్ కమిటీ నూతన చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ అన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన గీతను శనివారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. కడ్తాలలో ఎంపీ ఎం.రవి, ఎమ్మెల్యే నారాయణరెడ్డిలు గీతను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతుల శ్రేయస్సు కోసం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. రైతుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశారని, సన్న వడ్లకు క్వింటాలుకు 500బోనస్ ఇస్తున్నారని చెప్పారు. పలు సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు త్వరలోనే మాఫీ చేస్తారన్నారు. ఎమ్మెల్యే సహకారంతో ఆమనగల్లు ఏఎంసీని ఆదర్శవంతంగా తీర్చిదిద్ది సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్యనాయక్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, తలకొండపల్లి ప్యాక్స్ చైర్మన్ కేశవరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బిచ్యనాయక్, కిషన్‌రెడ్డి, జగన్, మానయ్య, నాయకులు వెంకటేశ్, లక్ష్మయ్య, వెంకన్న, సత్యం, సంపత్‌కుమార్, రమేశ్, మల్లేశ్, మహేశ్, శ్రీకాంత్, షాబుద్దీన్, మహేందర్, పవన్, ఎం.శ్రీను, మల్లేశ్‌గౌడ్, సుమన్, జహంగిర్‌బాబ, జహంగిర్ అలీ ఉన్నారు. అలాగే గీతనర్సింహ.. ఎమ్మెల్యే నారాయణరెడ్డిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

'కేబీఆర్' తరహాలో జాఫర్‌పల్లి అర్బన్ పార్కు



జాఫర్‌పల్లి అర్బన్ పార్క్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఉన్న కాసు బ్రహ్మానందరెడ్డి(కేబీఆర్) పార్క్ తరహాలో పరిగి శివారులో జాఫర్‌పల్లి అర్బన్ పార్క్‌ను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. జాఫర్‌పల్లిలో 120ఎకరాల్లో రూ.4కోట్లతో ఏర్పాటు చేయనున్న పార్క్‌కు శనివారం శంకుస్థాపనచేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ పార్క్ చుట్టూ మూడున్నర కిలోమీటర్ల మేర కాంపౌండ్ నిర్మిస్తామన్నారు. మధ్యలో రెండుచోట్ల సెంట్రల్ లైటింగ్ సిస్టం ఉంటుందని, పార్క్ అభివృద్ధికి రూ.4కోట్లు సరిపోకుంటే హెచ్‌ఎండీఏ ద్వారా మరిన్ని నిధులు తెస్తామన్నారు. సందర్శకులకు పార్కింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాకు తలమాణికంగా పార్క్‌ను నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, పరిగి ఏఎంసీ చైర్మన్ బి.పరశరాంరెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి కె.హన్మంతు, ఫారెస్ట్ రేంజర్ జి.ప్రతిమ, తహసీల్దార్ ఆనంద్‌రావు, అధికారులు సాయికుమార్, భీమ్లానాయక్, కాంగ్రెస్ నాయకులు అంజనేయులు, తావుర్యా, చిన్ననర్సింహులు, బి.ఆనందం, ఎం.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లాల్‌కృష్ణప్రసాద్ ఎమ్మెల్యే, అధికారులను సన్మానించారు. లాల్‌కృష్ణ కోరిన రోడ్ల అభివృద్ధికి నిధులిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఆవిష్కరణలు చేయాలి



మాట్లాడుతున్న చంద్రక్రాంత్

ఇబ్రహీంపట్నం, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానంతో నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు కృషిచేయాలని యాక్సెంచర్ అసోసియేట్ డైరెక్టర్ చంద్రక్రాంత్ దన్నే అన్నారు. ఇబ్రహీంపట్నంలోని గురునానక్ యూనివర్సిటీలో మూడు రోజులు జరిగిన జాతీయ స్థాయి హ్యాకథాన్(హ్యాక్ ఎరీనా) 2024 వేడుకలు శనివారం ముగిశాయి. ముఖ్య అతిథి చంద్రకాంత్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీస్తాయన్నారు. నైపుణ్యాలను ప్రదర్శించుకునే అవకాశమొచ్చిందన్నారు. వర్సిటీ వీసీ గగన్‌దీప్‌సింగ్ కోహ్లి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిభను ప్రదర్శించేందుకు సదుపాయాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ విశ్వవిద్యాలయాలు, కాలేజీల, సాంకేతిక సంస్థల నుంచి 1,500 మంది విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్, స్మార్ట్ సిటీ వంటి అంశాలపై అనుభవాలను పంచుకున్నారు.

రైతులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్ సులోచన, కమిటీ మెంబర్లు

షాద్‌నగర్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతు రాజ్యంలో తాము ఎల్లప్పుడూ రైతులకు అండగా ఉంటామని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలు, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆశీస్సులతోనే తమకు పదవులు దక్కాయన్నారు. ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ముచేయకుండా రైతు శ్రేయస్సుకు పాటుపడతామని చెప్పారు. వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని, లక్ష రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసిందన్నారు. రాజకీయ జీవితాన్ని ప్రజలకు అంకితమిచ్చిన వీర్లపల్లి శంకర్ లాంటి ఎమ్మెల్యేను తానెప్పుడూ చూడలేదని, భవిష్యత్తులోనూ చూడబోనని కొనియాడారు.

27న ప్రమాణ స్వీకారం: మార్కెట్ కమిటీ పాలకవర్గం ఈ నెల 27న ప్రమాణ స్వీకారం చేయనుంది. కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు హాజరువుతారని నాయకులు తెలిపారు. సమావేశంలో నూతన డైరెక్టర్లు బాలశౌరి, రవి, నర్సింహులు, సురేష్, వెంకటనర్సింహారెడ్డి, లాహోటి భరత్, కె.భరత్, మల్లయ్య, పి.వెంకట్‌రెడ్డి, సందీప్‌కుమార్, నవీన్‌కుమార్, నాయకులు రఘు, కృష్ణారెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఇబ్రహీం తదితరుల పాల్గొన్నారు.

తుది దశకు ఇంటింటి సర్వే

(5వ పేజీ తరువాయి)

గ్రామీణ ప్రాంతాల్లో 89 శాతం, మునిసిపాలిటీల పరిధిలో 90 శాతం సర్వే పూర్తయ్యింది. మిగిలిన కుటుంబాలను త్వరగా పూర్తి చేసేలా ఆయా జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకుంటున్నారు.

- రంగారెడ్డి జిల్లాలో 6,04,421 ఇళ్లను గుర్తించగా, శనివారం వరకు 5,376 మంది ఎన్యుమరేటర్లు 5,33,664 ఇళ్లలోని కుటుంబాల వివరాలను నమోదు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో 2,57,063 కుటుంబాలకు సంబంధించి సర్వే వివరాలను సేకరించారు. అలాగే మున్సిపాలిటీల్లో 2,76,601 ఇళ్లలోని కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేశారు.
- వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా 2,83,373 ఇళ్లు ఉన్నట్లు గుర్తించగా, ఈనెల 23వ తేదీ వరకు 2,52,535 ఇళ్లల్లోని కుటుంబాల వివరాలను ఎన్యూమరేటర్లు నమోదు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 2,38,635 ఇళ్లలోని 2,12,192 కుటుంబాల వివరాలు నమోదు చేసుకోగా, మునిసిపాలిటీల పరిధిలో 44,738 ఇళ్లలోని 40,343 కుటుంబాల వివరాలు నమోదు చేశారు.

రంగారెడ్డి జిల్లాలో చకచకా డాటా ఎంట్రీ

రంగారెడ్డి జిల్లాలో డాటా ఎంట్రీ చకచకా కొనసాగుతోంది. సర్వే వివరాలను కంప్యూటర్‌లో ఎంట్రీ చేసేందుకు ఆపరేటర్లకు రెండు రోజులు శిక్షణ ఇచ్చారు. 2,500 మంది ఆపరేటర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. 24 గంటల పాటు డాటా ఎంట్రీ కొనసాగుతుంది. షిఫ్టుల వారీగా విధులు నిర్వర్తిస్తున్నారు. శనివారం ఒక్క రోజే జిల్లాలో 7,700 కుటుంబాల సర్వే వివరాలను కంప్యూటరీకరణ పూర్తి చేశారు.

ఎన్యుమరేటర్‌కు 120 నుంచి 180 ఇళ్లు

ఒక్కో ఎన్యుమరేటర్‌కు 120 నుంచి 180 వరకు ఇళ్లను కేటాయించారు. ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించేందుకు ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల సేవలు తీసుకుంటున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠశాల విధులు పూర్తి చేసుకుని, ఆ తర్వాత ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నారు.

వికారాబాద్‌లో డాటా ఎంట్రీకి ఏర్పాట్లు

వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం వరకు 89శాతం సర్వే పూర్తి కాగా, అధికార యంత్రాంగం డాటా ఎంట్రీపై దృష్టి సారించింది. సర్వే ఫారాల్లోని వివరాలను కంప్యూటరీకరణ చేసేందుకు 240 మంది డాటాఎంట్రీ ఆపరేటర్లను నిమామకం చేశారు. కాగా సర్వే సమాచారాన్ని కంప్యూటరీకరణ చేసేందుకు 176 కంప్యూటర్లను సిద్ధం చేశారు. ఈ నెల 19 నుంచి 27వ తేదీ వరకూ కంప్యూటరీకరణ చేయాల్సి ఉండగా, ఇంకా జిల్లాలో ఆ ప్రక్రియ ఇంకా ప్రారంభించలేదు.



ధారూరులో 97 శాతం పూర్తి...

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో శనివారం వరకు 97 శాతం పూర్తి చేసుకుని ధారూరు మండలం జిల్లాలో మిగతా మండలాల కంటే ముందుండగా, మర్పల్లి 92 శాతం, కోట్‌పల్లి 95, బొంరాస్‌పేట్ 93, నవాబ్‌పేట్ 93, దుద్యాల్ 89, దోమ 90, పరిగి 89, బంట్వారం 91, చౌడాపూర్ 90, కొడంగల్ 86, తాండూరు 88, వికారాబాద్ 87, మోమిన్‌పేట్ 86, పూడూరు 84, పెద్దేముల్ 87, దౌల్తాబాద్ 90, కులకచర్ల 90, బషీరాబాద్ 88, యాలాల్ మండలంలో 79 శాతం సర్వే పూర్తయింది. పట్టణ ప్రాంతాల్లో పరిగి మునిసిపాలిటీ పరిధిలో 97 శాతం సర్వే పూర్తి కాగా, కొడంగల్ పరిధిలో 92, వికారాబాద్‌లో 94, తాండూరు మునిసిపాలిటీలో 85 శాతం సర్వే పూర్తయింది. ఇదిలా ఉంటే, సర్వే పూర్తి చేసిన వారి నుంచి శనివారం వరకు 1,54,479 ఫారాలు అధికారులకు అందాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన ఫారాలు 1,24,522 ఉండగా, పట్టణ ప్రాంతాలకు చెందిన 29,957 ఫారాలు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వే వివరాలు

	రంగారెడ్డి	వికారాబాద్
మొత్తం ఇళ్లు	6,04,421	2,83,373
సర్వే పూర్తయిన ఇళ్లు	5,33,664	2,52,535
పూర్తయిన సర్వే శాతం	88.3	89 శాతం
	రంగారెడ్డి	వికారాబాద్
మునిసిపాలిటీలు	16	04
సర్వే పూర్తయిన ఇళ్లు	2,76,601	40,343
సర్వే శాతం	83	90 శాతం
	రంగారెడ్డి	వికారాబాద్
మండలాలు	21	20
సర్వే పూర్తయిన ఇళ్లు	2,57,063	2,12,192
సర్వే శాతం	95	89 శాతం

కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బషీరాబాద్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. బషీరాబాద్‌లోని రైతు వేదికలో శనివారం తహసీల్దార్ వై.వెంకటేష్ అధ్యక్షతన రూ.54లక్షల 6వేల 264 విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులతో పాటు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా నవాంద్గీ నుంచి కర్ణాటక హక్కేడ వరకు గల 1.45కిలో మీటరు సరిహద్దు లింకు రోడ్డుకు రూ.కోటి 15లక్షలు మంజూరు కాగా ఎమ్మెల్యే శనివారం కర్ణాటక వైద్య విద్యశాఖ మంత్రి శరణ్‌ప్రకాష్ రుద్రప్ప పాటిల్‌తో కలిసి ఆయన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కాగా, ఎమ్మెల్యే పాల్గొన్న చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బషీరాబాద్ ఏఎంసీ వైస్‌చైర్మన్ చందర్‌నాయక్‌కు కుర్చీ కేటాయించకుండా నిలబెట్టడంతో చర్చనీయాంశమైంది. వైస్‌చైర్మన్ గిరిజనుడు కావడంతో కుర్చీ ఇవ్వకుండా, ప్రొటోకాల్ పాటించకుండా అవమానపర్చారని ఆయన అభిమానులు మండిపడ్డారు.

'వేధింపుల ఆరోపణలు అవాస్తవం'

పరిగి, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): పరిగి డిపోలో ఆర్టీసీ అధికారుల వేధింపులతో కంట్రోలర్ భూపతిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారన్న వార్తల్లో వాస్తవంలేదని పరిగి డిపో మేనేజర్ ఎం.కరుణశ్రీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కంట్రోలర్ భూపతిరెడ్డి ఈనెల 19వ తేదీన డ్యూటీ చేశారని, 20న వీక్లీ ఆఫ్ అని తెలిపారు. 21, 22వ తేదీల్లో విధులకు హాజరుకాలేదని పేర్కొన్నారు. మూడు రోజులుగా విధులకు దూరంగా ఉన్నారని, పరిగి డిపోలో వేధింపులకు అవకాశమే లేదని స్పష్టం చేశారు. వేధింపుల ఆరోపణలను ఆమె ఖండించారు.

స్టోన్ క్రషర్ భూముల సర్వే

తాండూరు రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంతారంలో కొనసాగుతున్న జరీనా స్టోన్ క్రషర్ భూములను సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించారు. మండల సర్వేయర్ మహేష్ శనివారం జరీనా స్టోన్‌కు సంబంధించిన భూములు సర్వే చేశారు. డిజిటల్ సర్వేలో పూర్తి వివరాలు నమోదు చేసుకున్నారు. సర్వేయర్ 6 ఎకరాల భూమిని సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేశారు. సర్వే మ్యాప్ పూర్తి వివరాలతో ఇవ్వాలని గ్రామస్తులు సర్వేయర్‌ను కోరారు. తహసీల్దార్ ఆదేశాలతో సర్వే మ్యాప్‌ను అందిస్తామని ఆయన చెప్పారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ

శామీర్‌పేట, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలను నేరాలను నియంత్రించవచ్చని పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు అన్నారు. శామీర్‌పేటలోని శ్రీరామాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ కెమరాలను ముఖ్యఅతిథిగా ఏసీపీ రాములు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు హారిక, దరశథ్, శామీర్‌పేట కట్టు మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ అశోక్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

యాలాల, నవంబరు 23: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు.

కులకచర్ల: మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం వికారాబాద్ ఆర్డీవో వాసుచంద్ర పరిశీలించారు. స్థానిక కేజీబీవీ, బాలుర ఉన్నత పాఠశాలల్లో భోజనాన్ని పరిశీలించారు.

యథేచ్ఛగా చెట్ల నరికివేత

- విద్యుత్ తీగలకు తగులుతున్నాయని సగం వరకు చెట్ల నరికివేత
- ముందుచూపు లేని అధికారులు
- విద్యుత్ లైన్లకింద మొక్కలు నాటకుండా చూడాలని వినతి


సంస్కృతి టౌన్‌షిప్ రోడ్డులో నరికేసిన చెట్లు

ఘట్‌కేసర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. అవి కాస్త విద్యుత్ తీగలకు తగులుతుండటంతో విద్యుత్ అధికారులు చెట్లకొమ్మల నరికివేతకు శ్రీకారం చుట్టారు. ఈ నేపథ్యంలో పలు చోట్ల చెట్ల కొమ్మలకు బదులుగా చెట్లను సగం వరకు నరికివేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ నుంచి సంస్కృతి టౌన్‌షిప్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలను విద్యుత్ సిబ్బంది సగం వరకు నరికివేశారు. ఇన్ని రోజులు ఎంతో ఆహ్లాదాన్నిచ్చిన పచ్చని చెట్లు లేక ప్రస్తుత ఈ రోడ్డు బోసిపోయి కనిపిస్తోంది. విద్యుత్ లైన్ల కింద మొక్కలు నాటడం వల్ల అవి పెరిగి పెద్దయ్యాక నరికివేతకు గురవడం పరిపాటిగా మారింది. చెట్లను నరికే పనిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడంతో యంత్రాలతో ఇష్టానుసారంగా నరికివేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనిలో పనిగా వారు కలపకోసమే చెట్లను సగంవరకు నరికేస్తున్నారని పర్యవరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు స్పందించి చెట్లు నాటే సమయంలో బలంగా ఉండే చెట్లను నాటడంతోపాటు తీగల కింద తక్కువ ఎత్తు పెరిగే మొక్కలను నాటేవిధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

చెట్లను నరికేయడం విచారకరం



అన్నోజిగూడ నుంచి టౌన్‌షిప్ వరకు గల ప్రధాన రోడ్డులో ఒకవైపు తీగలకు తగులుతున్నాయనే కారణంతో చెట్లను సగం వరకు నరికేయడం విచారకరం. పచ్చని చెట్లు నరికివేయడంతో రోడ్డంతా బోసిపోయింది. సంస్కృతి టౌన్ షిప్‌లో పచ్చదనంకు అధిక ప్రధాన్యతనిస్తుంటే మరోపక్క చెట్లను ఇష్టాను సారంగా తొలగించడంను చూస్తుంటే బాధ కలుగుతోంది.

- బెజ్జంకి హరిప్రసాదరావు, సంస్కృతి టౌన్ షిప్ అసోసియేషన్ అధ్యక్షుడు


నరికివేతతో మోడువారిన చెట్లు

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

పలుచోట్ల విద్యుత్ తీగలకింద చెట్లు ఉండటం వల్ల తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో ఏడాదిలో మూడుసార్లు చెట్ల కొమ్మలు తొలగించాల్సి వస్తోంది. వర్షాకాలం ప్రారంభంలో వీచే ఈదురు గాలులకు పలుమార్లు చెట్ల భారీ కొమ్మలు విరిగి వైర్లపై పడటం వల్ల స్తంభాలు విరిగిపోయాయి. దీంతో గంటల తరబడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. చిన్నచిన్న మండలను మాత్రమే తొలగిచాం. భవిష్యత్తులో పెద్దకొమ్మలు నరకకుండా చర్యలు తీసుకుంటాం.

- ప్రదీప్‌కుమార్, విద్యుత్ ఏఈ, నారపల్లి

ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం


కులకచర్ల: కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కులకచర్ల, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బండవెల్కిచర్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి బొంరెడ్డిపల్లికి బీటీ రోడ్డు పనులను శనివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో 104మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మొగులయ్య, తహసీల్దార్ మురళీధర్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి, భరత్‌కుమార్, బీఎస్.ఆంజనేయులు, గోపాల్‌నాయక్, అంజిలయ్యగౌడ్ పాల్గొన్నారు.

దోమ: దోమ మండల కేంద్రం నుంచి రూ.6కోట్ల వ్యయంతో మోత్కుల కుంటతండా, నెర్ల తండా, గొట్ల చెల్కతండాకు బీటీరోడ్డు పనులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. అనంతరెడ్డిపల్లికి రూ.55లక్షలు, రూ.కోటీ 25లక్షలతో బట్లచందారం గ్రామానికి స్థానిక నాయకులతో కలిసి రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం దిర్సంపల్లిలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

పూడూరు: మండలంలోని బాకాపూర్, చింతలపల్లి గ్రామాల్లో బీటీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శనివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్, షకీల్, శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాక కోసం చీకట్లో నిరీక్షణ

కులకచర్ల: స్థానిక రైతు వేదికలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రాక కోసం మహిళలు చీకట్లో నిరీక్షించాల్సి వచ్చింది. శనివారం మధ్యాహ్నం 2గంటలకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ నేపథ్యంలో లబ్ధిదారులు మధ్యాహ్నం ఒంటిగంటకు వచ్చారు. రాత్రి 7:30గంటలైనా ఎమ్మెల్యే కులకచర్లకు చేరుకోలేదు. సాయంత్రం 6:30గంటలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 7:30 గంటలకు విద్యుత్ వచ్చినా ఎమ్మెల్యే రాకపోవడం గమనార్హం.

మోడల్ స్కూల్‌కు అన్ని వసతులు

పరిగి: మోడల్ స్కూల్‌కు కావాల్సిన అన్ని వసతులు అన్ని సమకూరుస్తామని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని జాఫర్‌పల్లి మోడల్‌స్కూల్‌లో శనివారం నిర్వహించిన మాక్‌పోలింగ్‌లో పాల్గొన్నారు. మాక్‌పోలింగ్‌లో ప్రతిభను చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఆయన వెంట బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, తహసీల్దార్ ఆనంద్, పరశురాంరెడ్డి, హన్మంత్‌ముదిరాజ్ ఉన్నారు.

టీఎంటీఎఫ్ పరిగి తాలుకా కార్యవర్గం

పరిగి, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాదిగ ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎంటీఎఫ్) పరిగి నియోజకవర్గం కొత్త కార్యవర్గాన్ని శనివారం పరిగిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలుకా అధ్యక్షుడిగా కుందేటి వెంకటయ్య, ప్రధానకార్యదర్శిగా నరేందర్, గౌరవ అధ్యక్షుడిగా రాములు, ఉపాధ్యక్షులుగా సుధాకర్, మహిళా ఉపాధ్యక్షులుగా బాలమణి, కోశాధికారిగా నర్సింహులు, అసోసియేట్ అధ్యక్షుడిగా జంగయ్య, కార్యదర్శులుగా రాజేందర్, ఆంజనేయులు, కృష్ణ, బి.కృష్ణ, బి.నర్సమ్మ, చెన్నయ్య, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బుచ్చయ్య, సభ్యుడిగా శ్రీనివాస్, మీయా కన్వీనర్‌గా వెంకటప్రసాద్, లక్ష్మీనరసింహ, సలహాదారులుగా జీహెచ్‌ఎంలు నర్సింహులు, అంజయ్యలు ఎన్నికయ్యారు.

నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని ఇన్ఫోసినోటెక్ సంస్థ సీఈవో సౌరవ్ కరుణాకర్ తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం జరిగిన ఇన్‌క్లూజన్ అండ్ సస్టైనబిలిటీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనురాగ్‌యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ అర్చన, డీన్లు విష్ణుమూర్తి, విజయకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు

మేడ్చల్ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీజేపీ ఘన విజయం సాధించిన సందర్భంగా శనివారం మేడ్చల్‌లో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్‌గౌడ్ ఆధ్వర్యంలో, పోచారం పరిధి నారపల్లి విజయపురి కాలనీలో మేడ్చల్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి, బొంరాస్‌పేట్‌లో మండల అధ్యక్షుడు నర్సింహులు ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


కీసర: గురుకుల పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న మేడ్చల్ అదనపు కలెక్టర్ జయేందర్‌రెడ్డి

కీసర, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. కీసర పరిధిలోని కీసర, భోగారం, అంకిరెడ్డిపల్లిలోని ప్రభుత్వ బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ గురుకుల పాఠశాలలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలం నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ పాల్గొన్నారు.

తాండూరు రూరల్: ఇకపై వారంలో మూడురోజులు పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్నారు. బిజ్వార్ ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్‌ఎం వాజీర్, ఉపాధ్యాయులున్నారు.

కొడంగల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషన్ బలరాంనాయక్ సూచించారు. కలెక్టర్ ఆదేశాలతో శనివారం కొడంగల్‌లోని జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం అందించారు.

దోమ: ఊటుపల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీవో మహేశ్‌బాబు పరిశీలించారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

మోమిన్‌పేట్: ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేకాధికారి డాక్టర్ సదానందం ఎంఈవో మల్లేశంతో కలిసి పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో విజయలక్ష్మి ఉన్నారు.

యాలాల: మండల కేంద్రంలోని జడ్పీఎస్ బాలుర పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీవో పుష్పలీల, తహసీల్దార్ అంజయ్య పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం ప్రతిరోజు విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సూచించారు. వీరితోపాటు ఎంఈవో సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

పెద్దేముల్: మండల కేంద్రంలోని యూపీఎస్, జడ్పీహెచ్ఎస్ పాఠశాలలను తహసీల్దార్ వెంకటేష్‌ప్రసాద్‌తో పాటు ఎంపీడీవో జర్నప్ప, విద్యాధికారి నర్సింగ్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం అన్నపూర్ణ, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

మున్సిపల్ ఆదాయం పెంచాలి

మేడ్చల్ టౌన్: మున్సిపల్ ఆదాయాన్ని పెంచాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. తన కార్యాలయంలో శనివారం మున్సిపల్ బిల్‌కలెక్టర్లు, వార్డు అధికారులతో సమావేశమయ్యారు.

తెలంగాణ సాంస్కృతిక చైర్‌పర్సన్‌ను కలిసిన నేతలు

మేడ్చల్ టౌన్: నూతనంగా తెలంగాణ సాంస్కృతిక చైర్‌పర్సన్ గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జీవీ వెన్నెలను గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ నేతలు మారేపల్లి సుధాకర్, కుండ భానుచందర్, ప్రభాకర్ శనివారం ఆమె నివాసంలో మర్యాదపూరకంగా కలిసి సన్మానించారు.

ప్రియాంకాగాంధీ విజయం పట్ల సంబురాలు

కులకచర్ల: కేరళలోని వయనాడ్‌లో ప్రియాంకగాంధీ ఘన విజయం పట్ల కులకచర్లలో కాంగ్రెస్ నాయకులు శనివారం సంబరాలు జరుపుకున్నారు. 4లక్షలకుపైగా భారీ మెజారిటీతో విజయం సాధించడంతో టపాసులు కాల్చి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమ్‌రెడ్డి, అంజనేయులు, అంజిలయ్యగౌడ్ పాల్గొన్నారు.

మార్కెట్‌లో ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లు

ధారూరు: ధారూరు మార్కెట్ యార్డులో శనివారం సాయంత్రం ధాన్యం 1348.4 క్వింటాళ్లు, మొక్కజొన్న 344 క్వింటాళ్ల కొనుగోళ్లు జరిగాయని అధికారులు చెప్పారు.

లోక్‌మంథన్‌లో భాస్కరయోగి

పరిగి: శిల్పారామంలో జరుగుతున్న లోక్‌మంథన్ కార్యక్రమంలో పరిగి పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రచయిత డాక్టర్ పి.భాస్కరయోగి పాల్గొన్నారు. పండుగల్లోని అంతరార్థంపై ప్రసంగించారు.

ఘనంగా కార్తీక మాసం పూజలు

మోమిన్‌పేట్: కార్తీకమాసం వనమహోత్సవం సందర్భంగా టేకులపల్లికి చెందిన భగవత్ గీతా భక్తులు, భజన మండలి భక్తులు శనివారం రాళ్లగూడుపల్లి సమీపంలోని నందివాగు పరివాహక ప్రాంతంలో వెలిసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో సహపంక్తి భోజనాలు చేశారు.

మర్పల్లి: మొగిలిగుండ్లకు చెందిన మల్లేశం గత మార్చి నెలలో రూ.10వేలు ఒక ఖాతాకు పంపించబోయి మరొక ఖాతాకు డబ్బులు వెళ్లడంతో డయల్ 1930కు ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ సురేశ్ తెలిపారు. అట్టి డబ్బులకు సంబంధించిన ఆర్డర్ కాపీని శనివారం అందించామన్నారు.

చైర్‌పర్సన్ సొంత ఖర్చులతో స్ట్రీట్ లైట్ల ఏర్పాటు

ఘట్‌కేసర్ రూరల్: మున్సిపాలిటీలోని అవుషాపూర్, అంకుశాపూర్, ఘనాపూర్ గ్రామాల్లో శనివారం ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ సొంత ఖర్చులతో 54స్ట్రీట్ లైట్లను ఏర్పాటు చేశారు.

నేడు రేపు పాత తాండూరు బోనమ్మ జాతర

తాండూరు: తాండూరు బోనమ్మ దేవాలయం జాతర ఉత్సవాలకు ముస్తాబైయింది. నేడు(ఆదివారం) బోనాలు, రేపు (సోమవారం) రాత్రి 11.30 గంటలకు రథోత్సవం కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు వివరించారు. ఉత్సవాలకు ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు.

కేజీఆర్ కళాశాలలో రక్త దానశిబిరం

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీ రాంపల్లిలోని కేజీఆర్ కళాశాలలో శనివారం మున్సిపల్ కమిషనర్ ఎస్.భాస్కర్‌రెడ్డి హైదరాబాద్ పారిశ్రామిక వేత్తల సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

పరిగికి రూ.16 కోట్ల నిధులు

పరిగి: అమృత్-2 కింద పరిగికి రూ.16కోట్ల నిధులు మంజూరైనట్లు పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ తెలిపారు. కొత్తగా వాటర్‌ట్యాంకుల నిర్మాణ స్థలాలను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు.

కళాశాలలో ఎన్‌సీసీ దినోత్సవం

శామీర్‌పేట: ఎన్‌సీసీ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ సీటీఓ స్రవంతి విద్యార్థినులతో శనివారం మొక్కలను నాటి, చెత్త చెదారాన్ని తొలగింపజేశారు.

ప్రజాపాలన విజయోత్సవాలపై ప్రదర్శనలు

శామీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన-ప్రజా విజయోత్సవాలు- 2024 కార్యక్రమాన్ని శనివారం తూంకుంట పరిధిలోని శామీర్‌పేట, తూంకుంట, బాబాగూడ, బొమ్మరాసిపేట ప్రాంతాల్లో తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు కళాయాత్ర ప్రదర్శనలిచ్చారు.

పాఠశాలకు టీవీ, సోలార్ బ్యాటరీ అందజేత

బొంరాస్‌పేట: యూత్‌ఫర్ సేవా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సతీశ్ నాందర్‌పూర్ పాఠశాలకు శనివారం డిజిటల్ టీవీ, సోలార్ బ్యాటరీ అందజేశారు. టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ వారిని అభినందించారు.

బ్రిలియంట్ స్కూల్‌లో స్వయం పరిపాలన

బషీరాబాద్: స్థానిక బ్రిలియంట్ స్కూల్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తరగతిగదిలో తోటివిద్యార్థులకు పాఠాలు బోధించారు.

శ్రీవిష్ణు శివాలయంలో ప్రత్యేక పూజలు

మూడుచింతలపల్లి: మండలంలోని ఉద్దెమర్రి గ్రామ పరిధిలో ఉన్న శ్రీవిష్ణు శివాలయంలో శనివారం ఈసీఎల్‌కు చెందిన సబ్బనేని వాసుశిరీష దంపతులు స్వామివారికి ప్రత్యేకపూజలు చేసి దర్శించుకున్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

కొడంగల్/తాండూరు రూరల్: యువత ఓటు నమోదు చేసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. ఓటరు నమోదులో భాగంగా శనివారం స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అదేవిధంగా కరన్‌కోట్‌లో ఓటరు నమోదు ప్రక్రియను శనివారం తహసీల్దార్ తారాసింగ్ తనిఖీ చేశారు.

విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలి

శామీర్‌పేట: విద్యార్థులు క్రమశిక్షణ పాటించాలని మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. తూంకుంటలోని శ్రీ విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ గోనె హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టూడెంట్స్ లీడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని ముఖ్యఅతిథిగా రాజేశ్వర్‌రెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

నర్సింహులు మృతి పట్ల దత్తాత్రేయ సంతాపం

తాండూరు: తాండూరు మున్సిపల్ మాజీ చైర్మన్ నాగారం నర్సింహులు మృతి పట్ల హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ సంతాపాన్ని తెలుపుతూ శనివారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా సత్యసాయి బాబా జయంతి

కొడంగల్: సత్యసాయి బాబా 99వ జన్మదిన వేడుకలను శనివారం కొడంగల్‌లో నిర్వహించారు. కొడంగల్, తాండూర్ శ్రీ సత్యసాయి సేవా సమితి సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్‌లు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

మేడ్చల్ టౌన్: ఐడీఏ పరిధిలో ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

వ్యక్తి దారుణ హత్య


ఘటనాస్థలం వద్ద రోదిస్తున్న కుటుంబీకులు, గుమిగూడిన జనం

ధారూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తులు ఓవ్యక్తిపై మారుణాయుధాలతో దాడిచేసి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన మండలంలోని కుమ్మర్‌పల్లి చెరువు అలుగులో శనివారం వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కుమ్మర్‌పల్లి తండా సమీపంలోని భోజ్యానాయక్ తండాకు చెందిన వర్త్యపండరి(34) 2009లో దివ్యను వివాహం చేసుకుని హైదరాబాద్‌లోని హైటెక్‌సిటీలో ఉంటున్నాడు. లింగంపల్లిలో పార్కింగ్ సబ్‌కాంట్రాక్టర్‌గా పనిచేస్తూ అప్పుడప్పుడు తన స్వగ్రామమైన భోజ్యానాయక్ తండాకు వచ్చి పొలం పనులు చేసుకుని తిరిగి వెళ్లేవాడు. ఈనెల 22న శుక్రవారం ఉదయం 11.40గంటలకు దివ్యకు ఫోన్‌చేసి తాను భోజ్యానాయక్ తండాకు వెళ్లి వస్తానని చెప్పి హైదరాబాద్ నుంచి బయల్దేరాడు. ఆతర్వాత మధ్యాహ్నం 2.20గంటలకు భార్య ఫోన్ చేయగా తాను తండాకు వచ్చానని తర్వాత ఫోన్ చేస్తాననిచెప్పి పండరి ఫోన్‌కాల్ కట్‌చేశాడు. ఆ తర్వాత మధ్యాహ్నం కొంతమందితో కలిసి విందు చేసుకున్నాడు. వికారాబాద్ వెళ్లి తిరిగి శుక్రవారం రాత్రి 7గంటల సమయంలో తండాకు వచ్చిన పండరి తన వదిన అనూష వద్దకు వెళ్లి తాను బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికిరాలేదు. శనివారం ఉదయం కుమ్మర్‌పల్లి చెరువు అలుగులో పండరి మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, ధారూరు సీఐ రఘురాం, ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్‌లు ఘటనాస్థలానికి చేరకుని పంచనామా నిర్వహించారు. విచారణ జరిపి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పండరి ముఖం, తల, కాళ్లపై బలమైన గాయాలన్నాయి. గుర్తుతెలియని వ్యక్తులు పక్కాప్రణాళిక ప్రకారం శుక్రవారం రాత్రి దాడి చేసి హత్య చేసినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్య దివ్య, కుమారుడు పవన్ కుమార్ ఉన్నారు. భార్య ఫిర్యాదు ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోలీసు జాగిలంతో తనిఖీ

పండరి మృతదేహం వద్ద పోలీసు జాగిలంతో తనిఖీ చేయించారు. భోజ్యానాయక్ తండా సమీపంలోని సంజప్ప దరి వద్దకు జాగిలం పరుగుతీసింది. అక్కడ కొంతమంది మద్యం సేవించిన ఆనవాళ్లు ఉన్నాయి. అక్కడి నుంచి జాగిలం చెరువు వద్ద కలియతిరిగి రోడ్డుపైకి వచ్చి ఆగింది. హత్య చేసిన అనంతరం హంతకులు రోడ్డుపైకి వచ్చి వాహనంలో పరారైనట్లు అనుమానిస్తున్నారు.

విభిన్న కోణాల్లో అనుమానాలు

పండరి హత్యపై విభిన్న కోణాలలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భోజ్యానాయక్ తండాలో కాంగ్రెస్ పార్టీ నాయకుడైన వర్త్య పండరి గత సర్పంచ్ ఎన్నికల్లో కుమ్మర్‌పల్లి సర్పంచ్ స్థానానికి పోటీచేసి ఓడిపోయాడు. ఈసారి కూడా సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆలోచిస్తున్నట్లు తెలిసింది. ఈక్రమంలో ఏవరైనా ప్లాన్‌ప్రకారం హత్య చేశారా? లేదా ఇతర వివాదాలతో ఈహత్య జరిగిందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. తండాలో, కుమ్మర్‌పల్లిలో అందరితో మంచిగా మెలిగే పండరి దారుణ హత్యకు గురికావటం తండావాసులను తీవ్ర భయాందోళనకు, దిగ్ర్భాంతికి గురిచేసింది. ఈహత్యపై పోలీసులు వివిధ కోణాల్లో విచారణ చేస్తున్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పటాన్‌చెరువు, బండ్లగూడ, బాలాజీనగర్‌కు చెందిన మన్నె లక్ష్మయ్య(55) భార్య మన్నె నాగజ్యోతితో కలిసి బైక్‌పై యాదగిరిగుట్టకు బయల్దేరారు. శనివారం ఉదయం బైక్ యంనంపేట్ చౌరస్తా వద్దకు రాగానే లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నాగజ్యోతికి తలతో పాటు ఇతర శరీరభాగాలకు గాయాలు కాగా ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన నల్లగొండ జిల్లా సంస్థనారాయణపూర్ మండలం, గట్టుప్పల్‌కు చెందిన లారీడ్రైవర్ శివశేఖర్‌పై కేసు నమోదు చేసుకెఒని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కత్తితో దాడి చేసిన యువకునికి రిమాండ్

మేడ్చల్ టౌన్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ యువకుడిపై కత్తితో దాడిచేసిన యువకుడిని రిమాండ్ తరలించినట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు. మునీరాబాద్‌లో యూపీకి చెందిన పాన్‌షాప్ నిర్వాహకుడు ఓంకార్ పని ముగించుకుని శుక్రవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా ధన్‌రాజ్(20) ఓంకార్‌ను అడ్డగించి స్థానికేతరుడు అంటూ దుర్భాషలాడి గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన ధన్‌రాజ్ ఇంటికి వెళ్లి తన వద్ద ఉన్న కత్తితో దాడి చేయడంతో విఠల్ తీవ్రగాయాలపాలయ్యాడు. విఠల్ సోదరుడు భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ధన్‌రాజ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే

కొడంగల్ రూరల్, నవంబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జోరుగా కులగణన సర్వే కొనసాగుతోంది. అప్పాయిపల్లిలో సిబ్బంది ఇంటింటికి వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు.

శామీర్‌పేట: తూంకుంటలో శనివారం సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రొఫార్మా వివరాలను కంప్యూటర్లలో ఆన్‌లైన్ ఫీడింగ్ కార్యక్రమాన్ని కమిషనర్ వెంకటగోపాల్ ప్రారంభించారు.

కులకచర్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వే మండలంలోని చెల్లాపూర్‌లో పూర్తైంది. ఉపాధ్యాయుడు ఆనంద్, దస్తయ్యలు ఇంటింటికి వెళ్లి కుటుంబాల వివరాలను సేకరించారు. 430కుటుంబాల సర్వే ఫారాలను ఎంపీడీవోకు అందించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఘట్‌కేసర్, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి పేదలకు వరమని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఎడ్ల చిన్నకు రూ, 19వేల 500, కొలగని విఘ్నేష్‌కు రూ, 12వేల 500 చొప్పున మంజూరైన సీఎంఆర్ చెక్కులను ఆయన అందజేశారు.

మోమిన్‌పేట్: వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మన్నె శంకర్‌యాదవ్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

నవాబుపేట: వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీమ్‌భరత్ శనివారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు.

'గెలవలేకే స్థానిక ఎన్నికలు వాయిదా'

తాండూరు, నవంబరు 23 (ఆంధ్రజ్యోతి): కమిటీలు, కమిషన్‌ల పేరిట కాలయాపన చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం వాయిదా వేస్తూ కాలయాపన చేస్తోందని మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభ్రప్రదపటేల్ విమర్శించారు. తాండూరులో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లగచర్ల రైతులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

వేదాలు సత్యాన్ని మాత్రమే బోధిస్తాయి

వికారాబాద్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత మానవ సమాజానికి కేవలం సత్యాన్ని మాత్రమే బోధిస్తాయని మా శారద హాస్పిటల్ వ్యవస్థాపకులు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 99వ జయంతి ఉత్సవాలు శనివారం నిర్వహించారు. ఉదయం నగర సంకీర్తన, స్వామి వారికి పూజాభిషేకం అనంతరం గీతావాహిని బృందంతో భగవద్గీత పారాయణం నిర్వహించారు.